చదవండి.. చదివించండి..
నేటి శుభోదయ
ప్రతిక్షణం.. ప్రజల కోసం...
నిజమైన వార్తలు... నమ్మకమైన పత్రిక
నిరపేక్ష వార్తలు | నిజాయితీ జర్నలిజం | ప్రజల గొంతుక
వార్తలు, ప్రకటనల కోసం సంప్రదించండి
మా వెబ్‌సైట్ www.netishubhodaya.com | వాట్సాప్ 96965 71571
మీ నమ్మకం.. మా బాధ్యత.. శుభోదయంతో ప్రతి ఉదయం ప్రగతివైపు!

RNI TELTEL/2024/89620
తెలంగాణ
నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

GK MEDIA Voice of People
CHANNEL NO. 433
SSLC CABLE NETWORK
• SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది •

ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 181 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | శుక్రవారం 21 - ఆగష్టు - 2026 | వెల రూ. 5 /-

# ఉచిత పథకాలపై హైకోర్టు ఆగ్రహం..

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్న తెలంగాణ హైకోర్టు
- ఉచిత పథకాలకు నిధుల మళ్లింపు వల్ల అత్యవసర రంగాలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య
- నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఉచితాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్య



**నేటి శుభోదయ, వరంగల్ :** తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి , షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిరాకరించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం... పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది. అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించి, ఆ ఆదాయంతో సంక్షేమం చేపట్టవచ్చని సూచిస్తూ, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## 'స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నారు'..

### - కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్



- 1937 నిర్ణయం దేశ విభజనకు బీజం వేసిందన్న అమిత్ షా
- ఆ నిర్ణయంతో ద్విజాతి సిద్ధాంతానికి బలం వచ్చిందని విమర్శ
- బంకించంద్రుడి రచనను కాంగ్రెస్ అవమానిస్తోందని షా ఆరోపణ
- పూర్తి వందేమాతరంతో దేశ ఐక్యత బలోపేతమవుతుందన్న షా..

»2

## తెలుగు రాష్ట్రాల్లో మిలాద్ ఉన్ నబీ సెలవు తేదీ మార్పు..



- ఏపీలో మిలాద్ ఉన్ నబీ సెలవు తేదీ మార్పు
- గతంలో ఆగస్టు 25న సెలవుగా ప్రకటన
- తాజాగా ఆగస్టు 26, బుధవారానికి సెలవు మార్పు
- ముస్లిం మత పెద్దల అభ్యర్థన మేరకు నిర్ణయం

2

## రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన వెనుక దేశవ్యతిరేక శక్తులు

### - ధర్మపురి అర్వింద్



- రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలపై ధర్మపురి అర్వింద్ విమర్శలు
- రేవంత్ విదేశీ పర్యటనలన్నీ దేశంపై విద్వేషం చిమ్మే వర్గాలతోనే సాగుతున్నాయని ఆరోపణ

2

## నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

### క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ

- రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత అనుచిత వ్యాఖ్యలు
- కొండా సురేఖకు నోటీసులు జారీ చేసిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- కమిటీ ఎదుట హాజరై వివరణ ఇచ్చిన సురేఖ



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి, పరకాల నియోజకవర్గంపై తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసులకు స్పందిస్తూ, హైదరాబాద్‌లోని కమిటీ ఎదుట హాజరై ఈ మేరకు తన వివరణను సమర్పించారు. తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తం చేసిన రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరిని బాధ్యులను చేయడం సముచితం కాదని, అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఈ సందర్భంగా సురేఖ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, పీసీసీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణమైన గౌరవం, విశ్వాసం ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తన ప్రమేయం ఏమాత్రం లేదని... ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు.

## కొండా సుస్మిత, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ ఆగ్రహం



- పార్టీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు షోకాజ్ నోటీసు జారీ చేసిన మహేశ్ గౌడ్
- క్రమశిక్షణా కమిటీ సిఫార్సుల మేరకు చర్యలు ఉంటాయని వెల్లడి
- అందరూ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని సూచన

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణే ప్రధానమని, ఎంతటి వారైనా హద్దులు దాటి మాట్లాడితే చర్యలు తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత (మంత్రి కొండా సురేఖ కుమార్తె), కాంగ్రెస్ ఎమ్మెల్యేపై సీనియర్ నేత చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండా సుస్మిత వ్యవహారంలో ఆమె తల్లి, మంత్రి కొండా సురేఖకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరామని తెలిపారు. వారు ఇచ్చే వివరణ ఆధారంగా క్రమశిక్షణా కమిటీ సిఫార్సుల మేరకు తగిన చర్యలు ఉంటాయని చెప్పారు.

»2

## పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

### - రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

- 22ఏ పేరుతో రెవెన్యూ శాఖలో దందాలు, వేధింపులు సాగుతున్నాయన్న హరీశ్
- ప్రైవేట్ ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని మండిపాటు
- రెవెన్యూ శాఖలో 30 శాతం కమీషన్ల రాకెట్ నడుస్తోందని ఆరోపణ

»2



## పొంగులేటితో సంబంధాలు ఉన్న సంస్థలకు రూ. 15 వేల కోట్ల విలువైన భూముల బదిలీ

### - మహేశ్వర్ రెడ్డి



- 102 షెల్ కంపెనీల డేటా తన వద్ద ఉందన్న మహేశ్వర్ రెడ్డి
- 22ఏ నిషేధిత జాబితా పేరుతో భూ యజమానులను వేధిస్తున్నారని మండిపాటు
- ఈ అంశంపై సింగిల్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్

»2

## తెలుగు రాష్ట్రాల్లో మిలాద్ ఉన్ నబీ సెలవు తేదీ మార్పు..

**మొదటిపేజీ తరువాయి..** ఆంధ్రప్రదేశ్‌లో మిలాద్ ఉన్ నబీ ప్రభుత్వ సెలవు తేదీని మార్చారు. గతంలో ఆగస్టు 25న సెలవుగా ప్రకటించగా.. తాజాగా ఆగస్టు 26, బుధవారానికి మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముస్లిం మత పెద్దల అభ్యర్థన, నూతన చంద్ర దర్శనాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా మిలాద్ ఉన్ నబీ సెలవును ఆగస్టు 26కే ఖరారు చేసింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒకే రోజు ఈ పండగకు ప్రభుత్వ సెలవు అమల్లో ఉండనుంది.

## కొండా సుస్మిత, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి..** ఎవరికి వారు తమకు తామే అభ్యర్థులుగా ప్రకటించుకోవడం సరికాదని చురకలంటించారు. కాంగ్రెస్‌లో సీట్ల కేటాయింపుకు స్పష్టమైన నియమావళి, ఎన్నికల కమిటీలు ఉంటాయని, అందరూ పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. 22ఏ భూముల వ్యవహారంలో కింది స్థాయిలో జరిగిన పొరపాటుపై ప్రతిపక్షాలు కావాలనే బురద జల్లుతున్నాయని మండిపడ్డారు. ఈ విషయం తమ ప్రభుత్వం దృష్టికి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

## రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన వెనుక దేశవ్యతిరేక శక్తులు : ధర్మపురి అర్వింద్

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనల లక్ష్యంగా నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కార్పొరేట్ పెట్టుబడుల సేకరణ పేరుతో రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న విదేశీ పర్యటనలన్నీ భారత్‌పై విద్వేషం చిమ్మే వర్గాలతోనే సాగుతోందని ఆయన ఆరోపించారు. జార్జ్ సోరోస్ వంటి భారత్ వ్యతిరేక భావజాలం కలిగిన వ్యక్తులు, సంస్థల నిధులతో నడిచే వేదికల వద్దకే సీఎం వెళుతున్నారని విమర్శించారు. దేశవ్యతిరేక ఐడియాలజీ ఉన్న సంస్థలను కలవడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను హెచ్చరిస్తూ... గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రాజకీయ నాయకుల మాటలు విని పలువురు అధికారులు చివరకు జైలుపాలు కావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి వల్ల అధికారులకు ఎటువంటి రక్షణ ఉండదని, భవిష్యత్తులో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వచ్చే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## భారత విద్యార్థులకు గూగుల్ బంపర్ ఆఫర్.. ఏడాది పాటు 'ఏఐ ప్లస్' ఉచితం



**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్, భారతీయ కళాశాల విద్యార్థులకు ఒక అద్భుతమైన ఆఫర్‌ను ప్రకటించింది. విద్యార్థుల అభ్యాసానికి మద్దతుగా, తన 'ఏఐ ప్లస్' ప్లాన్‌ను ఏడాది పాటు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఆఫర్ కింద అర్హత కలిగిన విద్యార్థులు గూగుల్ అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్‌ను ఎలాంటి ఖర్చు లేకుండా ఉపయోగించుకోవచ్చు. గూగుల్ తన తాజా బ్లాగ్ పోస్ట్‌లో ఈ వివరాలను పంచుకుంది. ఈ ఉచిత సబ్‌స్క్రిప్షన్‌లో భాగంగా విద్యార్థులు 'జెమిని ఓమ్నీ' వంటి శక్తివంతమైన ఏఐ మోడల్‌కు యాక్సెస్ పొందుతారు. సాధారణ యూజర్లతో పోలిస్తే రెట్టింపు వినియోగ పరిమితులు, 400 జీబీ క్లౌడ్ స్టోరేజ్ వంటి ఇతర ప్రయోజనాలు కూడా ఉంటాయి. దీంతో పాటు, గూగుల్ ఏఐ ప్రో, యూట్యూబ్ ప్రీమియం కలిగిన బండిల్‌ను విద్యార్థులకు 70 శాతం వరకు తగ్గింపుతో అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. దీనివల్ల యాడ్స్ లేకుండా సంగీతం, వీడియోలను ఆస్వాదించవచ్చు. ఈ ఆఫర్లతో పాటు విద్యార్థుల కోసం గూగుల్ సరికొత్త లెర్నింగ్ టూల్స్‌ను కూడా జెమిని, గూగుల్ సెర్చ్‌లో అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'స్టూడెంట్ హబ్'ను రూపొందించింది. ఇది వారి చదువును క్రమబద్ధంగా నిర్వహించుకోవడానికి, జెమిని టూల్స్‌ను సమర్థంగా వాడుకోవడానికి సహాయపడుతుంది. అలాగే 'స్టడీ నోట్‌బుక్' అనే కొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. ఇది డయాగ్నస్టిక్ క్విజ్‌ల ద్వారా విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి, వారి లక్ష్యాలకు అనుగుణంగా వ్యక్తిగత స్టడీ ప్లాన్‌లను రూపొందించి ఇస్తుంది. వీటికి అదనంగా ప్రయాణంలో ఉన్నప్పుడు కూడా వాయిస్ ద్వారా రీసెర్చ్ రిపోర్టులను అడిగి తెలుసుకునేలా 'జెమిని లైవ్' ఫీచర్‌ను విస్తరించింది. గూగుల్ సెర్చ్‌లో క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థం చేసుకోవడానికి ఇంటరాక్టివ్ విజువల్స్, వివిధ సబ్జెక్టులపై ప్రాక్టీస్ క్విజ్‌లు, గూగుల్ లెన్స్ ద్వారా దశలవారీగా కాన్సెప్ట్‌లను నేర్చుకునే సౌకర్యాలను కూడా కల్పించింది. భారత్‌తో పాటు 140కి పైగా దేశాల్లో ఈ ఆఫర్ అందుబాటులో ఉందని గూగుల్ పేర్కొంది. అర్హత కలిగిన విద్యార్థులు అవసరమైన వెరిఫికేషన్ పూర్తి చేసి, డిసెంబర్ 31 వరకు ఈ ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను పొందవచ్చని కంపెనీ స్పష్టం చేసింది. సురక్షితమైన వాతావరణంలో, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వ్యక్తిగత అభ్యాసానికి మద్దతు ఇవ్వడమే తమ లక్ష్యమని గూగుల్ వివరించింది.

## 'స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నారు'..

### - కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్

**మొదటిపేజీ తరువాయి..** వందేమాతరం విషయంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలనే పాడాలన్న నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది సాధారణ నిర్ణయం కాదని.. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను అవమానించడమేనని ఆరోపించారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని మళ్లీ అమలు చేయడం ద్వారా అప్పటి తప్పిదాన్ని పునరావృతం చేస్తోందని విమర్శించారు. “1937లో ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ వందేమాతరాన్ని రెండు భాగాలుగా చేసింది. అదే దేశ విభజనకు బీజం వేసింది. అక్కడి నుంచి ద్విజాతి సిద్ధాంతానికి బలం వచ్చింది. చివరకు దేశం విడిపోయి పాకిస్తాన్ ఏర్పడింది” అని షా ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ మళ్లీ అదే నిర్ణయాన్ని అమలు చేస్తోందని అన్నారు. బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని షా పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ బంకించంద్రుడి గొప్ప రచనను మాత్రమే కాదు.. "వందేమాతరం" అంటూ ఉరి కంబాలు ఎక్కిన లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులను కూడా అవమానిస్తోందని విమర్శించారు. ఎన్నో ఏళ్లు జైళ్లలో గడిపిన వీరుల త్యాగాలను కూడా విస్మరిస్తోందని అన్నారు. వందేమాతరం రచనకు 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దే ప్రయత్నం చేసిందని షా తెలిపారు. దేశ ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు పూర్తి వందేమాతరాన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాడేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దీనికి అధికారిక మార్గదర్శకాలు కూడా జారీ చేశామని వెల్లడించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ మాత్రం పార్లమెంట్ నిర్ణయాన్ని కాదని.. 1937 నాటి పార్టీ తీర్మానాన్ని అమలు చేస్తోందని షా విమర్శించారు. కాంగ్రెస్ మళ్లీ బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. దేశ ప్రజలు ఈ నిర్ణయాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన 80 ఏళ్ల తర్వాత కూడా ఇలాంటి నిర్ణయాలను దేశ ప్రజలు సహించబోరని అన్నారు. కాగా, కాంగ్రెస్ మాత్రం తమ నిర్ణయాన్ని సమర్థించింది. 1937లో మహాత్మా గాంధీ, నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ తదితర అగ్రనేతలు ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాన్నే ఇప్పుడు పాటిస్తున్నామని కేసీ వేణుగోపాల్ తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో తొలి రెండు చరణాలనే పాడతామని స్పష్టం చేశారు. వందేమాతరం, జాతీయ గీతం తమకు భావోద్వేగ అంశాలని.. బీజేపీ మాత్రం దీనిని రాజకీయ అంశంగా మార్చిందని విమర్శించారు.

## పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

### - రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలోని రెవెన్యూ శాఖలో నిషేధిత భూముల (22Aఏ) పేరుతో బహిరంగంగా దందాలు, వేధింపులు సాగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన బహిరంగ లేఖ రాశారు. ఈ అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. చట్టప్రకారం నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు అడ్డుకోవాల్సిన 22ఏ నిబంధనను, ప్రైవేట్ ఆస్తులపై కావాలనే కృత్రిమ వివాదాలు సృష్టించి డబ్బులు గుంజడానికి వాడుకుంటున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ నుంచి ప్రారంభించి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ (HMDA) అనుమతులు ఉన్న వేలాది ప్లాట్లు, నివాసాలను ఏకపక్షంగా నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితమే క్రమబద్ధీకరించిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ (ULC) భూములను, క్లియర్ రిజిస్టర్డ్ పత్రాలు ఉన్న ఆస్తులను మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చడం తీవ్ర దుర్మార్గమని విమర్శించారు. రెవెన్యూ శాఖలో ఏకంగా 30 శాతం కమీషన్ల రాకెట్ నడుస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. ఒకసారి 22ఏ జాబితాలో పెట్టిన భూములను మళ్లీ తొలగించాలంటే మార్కెట్ విలువలో 30 శాతం కమీషన్లు ఇవ్వాలని దళారులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకించి ఓఆర్ఆర్ పరిసరాల్లో ఉన్న అత్యంత విలువైన భూములను బ్లాక్ చేసి, రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ఒప్పుకోవాలని యజమానులపై ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను ఈ జాబితాలో పెట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా బయటపెట్టినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 22ఏ జాబితాలో కొత్తగా చేర్చిన, అలాగే తొలగించిన ప్రతి భూమి వివరాలపై హైకోర్టు మాజీ న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ, ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని కోరారు. జిల్లాల వారీగా ఈ నిషేధిత భూముల జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి పారదర్శకత నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఒక అవినీతి మంత్రిని కాపాడేందుకు ప్రజల నమ్మకాన్ని పణంగా పెడుతున్నారని, రాహుల్ గాంధీ వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## పొంగులేటితో సంబంధాలు ఉన్న సంస్థలకు రూ. 15 వేల కోట్ల విలువైన భూముల బదిలీ - మహేశ్వర్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లక్ష్యంగా బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ నిషేధిత భూముల జాబితా, ‘భూ భారతి’ వ్యవహారాల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, నిన్న మంత్రి శ్రీనివాసరెడ్డికి బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. అవినీతిపై చర్చకు సిద్ధమా? అంటూ సవాల్ చేశారు. తన సవాల్‌ను స్వీకరిస్తే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని కోరారు. తన సవాల్ మేరకు ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయన మీడియా పాయింట్ వద్ద ఉన్నారు. అయినా, ఎవరూ రాకపోవడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు, ఫీనిక్స్ గ్రూప్ కంపెనీల నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సంబంధాలున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ తదితర సంస్థలకు సుమారు రూ.15 వేల కోట్ల విలువైన భూములు, ఆస్తుల బదిలీలు అక్రమంగా జరిగాయని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. దాదాపు 102 షెల్ కంపెనీలకు సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. కావాలనే భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి, ఆ తర్వాత కమీషన్లు, సెటిల్మెంట్ల కోసం రైతులను, భూ యజమానులను వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు పట్టా భూములను సైతం ఈ జాబితాలో చేర్చి 'కలెక్షన్ సెక్షన్'లా మార్చేశారని విమర్శించారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐ, ఈడీతో సమగ్ర విచారణ జరిపించాలని, అలాగే హౌస్ కమిటీ వేయాలని కోరారు. తన వద్ద ఉన్న సాక్ష్యాలను దర్యాప్తు సంస్థలతో పాటు రాహుల్ గాంధీకి కూడా లేఖ రూపంలో పంపుతానని తెలిపారు.

## సీబీఎస్ఈ 3 భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

### - ప్రణాళికను పునఃపరిశీలించాలని బోర్డుకు ఆదేశం

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** సీబీఎస్ఈ పాఠశాలల్లో మూడు భాషల విధానం అమలు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ విద్యా విధానం (NEP 2020) అమలును తాము వ్యతిరేకించడం లేదని, అయితే దీనిని అమలు చేసే క్రమంలో విద్యార్థులపై అనవసర ఒత్తిడి పడకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ విధానం యొక్క ఆచరణాత్మక అమలుపై మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయాలని బోర్డును ఆదేశించింది.

**ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రధానాంశాలు:**

ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతి వచ్చేసరికి మూడో భాషలో కూడా తప్పనిసరిగా బోర్డు పరీక్ష రాయాల్సి రావడం వారిపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ప్రస్తుత 6వ తరగతి విద్యార్థులకు ఈ మూడో భాష బోర్డు పరీక్ష నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అంతేకాకుండా, ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా అనే విషయాన్ని కూడా పునరాలోచించాలని స్పష్టం చేసింది.



పాఠశాలల్లో సరిపడా అర్హత కలిగిన ఉపాధ్యాయుల లభ్యత, పాఠ్యపుస్తకాలు, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థులు ఇన్నాళ్లుగా చదువుతున్న విదేశీ భాషల కాంబినేషన్ దెబ్బతినకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది.

# భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

## - పొంగులేటి శ్రీనివాస రెడ్డి

- బేతుపల్లి రెవెన్యూ గ్రామంలో ఇప్పటికే 6 వేల ఎకరాల భూ రీ సర్వే పూర్తి
- రీ సర్వేలో రైతుల అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే తుది హక్కుల నమోదు
- వ్యవసాయ భూములకు వెళ్లే దారులను పరిరక్షించాలి, దారులకు పట్టాలు ఇవ్వొద్దు
- చెరువులను పరిరక్షించి అవసరమైన హద్దులు, రక్షణ చర్యలు చేపట్టాలి
- రీ సర్వే అనంతరం 30 రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ.. ఆ తర్వాత ఆధార్ తరహాలో భూధార్ కార్డులు
- వచ్చే ఏడాదిన్నరలో వ్యవసాయ భూములు, ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి
- అక్రమంగా 22ఏ భూముల క్రమబద్ధీకరణకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు
- రాష్ట్రంలో భూ సమస్యలు లేని పరిస్థితి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం
- నారాయణపురంలో రైతులతో ముఖా ముఖి, ప్రత్యేక అవగాహన సదస్సులో పాల్గొన్న మంత్రి



**ఖమ్మం, ఆగస్టు 20, నేటి శుభోదయ :** రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూభారతి చట్టం లక్ష్యమని, రైతుల భూ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి, నిజాయితీతో పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం సత్తుపల్లి మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో కడాస్ట్రల్, నాన్-కడాస్ట్రల్ గ్రామాల భూ రీ సర్వేపై నిర్వహించిన రైతుల ముఖాముఖి, ప్రత్యేక అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు.బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని భేతుపల్లి, రామానగరం, తాళ్లమడ, గంగారం, నారాయణపురం, రామగోవిందపురం, పాకాలగూడెం గ్రామాల పంచాయతీ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భూ రీ సర్వే ప్రక్రియ, భూ హక్కుల నమోదుపై తమకు ఉన్న సందేహాలు, సమస్యలను రైతులు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ భేతుపల్లి రెవెన్యూ గ్రామంలో గత 25 రోజులుగా సుమారు 6 వేల ఎకరాల భూ రీ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. భేతుపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 12,047 ఎకరాల భూమి ఉందని, మొత్తం భూమికి రీ సర్వే నిర్వహిస్తున్నా మని చెప్పారు. మిగిలిన మరో 6 వేల ఎకరాల భూమికి కూడా రీ సర్వే పూర్తి చేస్తామని తెలిపారు.రీ సర్వే సందర్భంగా రైతులకు ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు లేదా లోపాలు కనిపిస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. రీ సర్వేలో ఏదైనా తప్పు జరిగితే రైతులు ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే సరిదిద్దేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని స్పష్టం చేశారు.వ్యవసాయ భూములకు వెళ్లే దారులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పొలాలకు వెళ్లే దారులకు పట్టాలు ఇవ్వొద్దని, దారులను రైతుల భూముల్లో భాగంగా నమోదు చేయొద్దని స్పష్టం చేశారు. రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేలా అవసరమైన అప్రోచ్ రోడ్లు, దారులను పరిరక్షించాలని సూచించారు.చెరువులను తప్పనిసరిగా పరిరక్షించాలని మంత్రి అన్నారు. చెరువులకు అవసరమైన హద్దులు, రక్షణ చర్యలు, కాంపౌండ్ నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దులను కూడా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. చెరువులను పరిరక్షిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు.భేతుపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 12,047 ఎకరాల భూమి ఉండగా, సుమారు 2,026 ఎకరాలు అసైన్డ్ భూములుగా ఉన్నాయని ఇందులో సుమారు 980 ఎకరాలను పేదలకు అందించినట్లు చెప్పారు. ఇంకా సుమారు వెయ్యి ఎకరాల అసైన్డ్ భూముల్లో కొంతమంది రైతులు సాగు చేస్తున్నప్పటికీ వారికి పట్టాలు లేవని వివరించారు.అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలు ఎక్కడా కోల్పోవని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులకు భూమిపై హక్కులు కల్పించే ప్రక్రియలో నిబంధనలకు అనుగుణంగా అన్ని అంశాలను పరిశీలిస్తామని చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో నిజంగా భూమిపై ఉన్న రైతులకు హక్కులు దక్కలేదని మంత్రి అన్నారు. భూములు లేని కొంతమందికి కూడా రైతుబంధు ప్రయోజనాలు అందిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు.నాగార్జునసాగర్ పైలట్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన సర్వేలో సుమారు 3,400 వరకు నకిలీగా గుర్తించిన పట్టాదారు పాస్ బుక్‌లు బయటపడ్డాయని చెప్పారు. భూమి రైతులకు అత్యంత భావోద్వేగంతో కూడుకున్న అంశమని, ఇది రాజకీయ అంశం కాదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. నిజమైన రైతులకు భూ హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.బేతుపల్లి గ్రామం తనకు కొత్త కాదని మంత్రి అన్నారు. గ్రామంలోని భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కూడా గ్రామంలోని సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూ రీ సర్వే నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి రైతు భూమికి ఖచ్చితమైన కోఆర్డినేట్లు, మ్యాప్ రూపొందించి, భూ హక్కులను నమోదు చేస్తామని చెప్పారు. రైతులు తుది టైటిల్స్ కోసం ఎదురుచూస్తున్నారని, రీ సర్వే పూర్తయిన తర్వాత ప్రక్రియను నిబంధనల మేరకు పూర్తి చేసి తుది హక్కులు అందజేస్తామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా భూ రీ సర్వే మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.రీ సర్వే పూర్తయిన తర్వాత 30 రోజుల పాటు రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కరించిన తర్వాతే తుది హక్కులను నమోదు చేస్తామని చెప్పారు. మనుషులకు ఆధార్ కార్డులు ఉన్నట్లుగా రైతుల భూములకు కూడా భూధార్ కార్డులు అందజేస్తామని తెలిపారు.రీ సర్వేలో ప్రతిరోజూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం భేతుపల్లిలో కూడా ఇదే విధానంలో రీ సర్వే జరుగుతోందని తెలిపారు. రీ సర్వే సమయంలో కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, రైతులు వాటిని అధికారుల దృష్టికి తీసుకువస్తే సరిచేసి తుది ప్రక్రియలో చేర్చుతామని అన్నారు. భూభారతి చట్టాన్ని తమ ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం తీసుకువచ్చిందని, చిత్తశుద్ధి, నిజాయితీతో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు, రైతులకు తమ ప్రభుత్వ చిత్తశుద్ధి, నిజాయితీ ఏమిటో తెలుసని అన్నారు.గత ప్రభుత్వం ధరణికి సంబంధించి నిబంధనలు కూడా పూర్తిస్థాయిలో రూపొందించలేదని మంత్రి విమర్శించారు. భూభారతి చట్టానికి మాత్రం కేవలం మూడు నెలల్లోనే నిబంధనలు రూపొందించినట్లు తెలిపారు.భూభారతిచట్టం రైతులకు ఉపయోగపడేలా పనిచేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా తాను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నానని చెప్పారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు త్వరలోనే వారికి మరోసారి బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.రైతులే తమకు అత్యంత ముఖ్యమని, రాష్ట్రంలో భూ సమస్యలు లేకుండా చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొట్టి సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేసినా తాము పట్టించుకోబోమని మంత్రి అన్నారు. భూభారతి చట్టం రైతులకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి క్షేత్రస్థాయిలో అమలును పరిశీలిస్తానని చెప్పారు.భూభారతి చట్టం రాబోయే ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి ప్రజల తీర్పుకు రెఫరెండంగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని అన్నారు.కొంతమంది భూ ఆక్రమణదారులు అమాయక ప్రజలను అడ్డుపెట్టుకుని 22ఏ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి ఇలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే వారిపై చర్యలు ప్రారంభించామని తెలిపారు.సామాన్య ప్రజలను ముందు పెట్టి అక్రమంగా దోచుకున్న భూములను రెగ్యులరైజ్ చేసుకునేందుకు చేసే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలించబోవని మంత్రి స్పష్టం చేశారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలో పనిచేసి రైతుల భూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రతి భూ సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.స్థానిక నాయకులు దయానంద్ మాట్లాడుతూ ధరణి కారణంగా అనేక మంది రైతులు భూ సమస్యలను ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సత్తుపల్లి ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు. ప్రతి రోజూ సుమారు 200 నుంచి 300 ఎకరాల వరకు భూ రీ సర్వే జరుగుతోందని, ఇప్పటి వరకు సుమారు 6 వేల ఎకరాల సర్వే పూర్తయిందని తెలిపారు. భవిష్యత్తులో మరో 6 వేల ఎకరాల భూమికి సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు.ధరణి సమయంలో భూములు లేని కొంత మంది కూడా నకిలీ పట్టాదారు పాస్‌బుక్‌లు పొందినట్లు గుర్తించామని, అర్హత లేని పాస్‌బుక్‌లను రద్దు చేసి వాటి ఆధారంగా పొందిన రైతుబంధు మొత్తాలను రికవరీ చేయాలని దయానంద్ కోరారు. భూ రీ సర్వేలో రైతులు రెవెన్యూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు.రైతులు మాట్లాడుతూ భూ రీ సర్వే పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. పొరుగు రైతుల సమ్మతితోనే భూముల హద్దులను నిర్ణయిస్తున్నారని చెప్పారు. భూములు ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఉండటంతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని, అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్‌బుక్‌లు జారీ చేసి సమస్యను పరిష్కరించాలని రైతులు మంత్రిని కోరారు.యెనుకట్లలోని 33 ఎకరాల చెరువును కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. చెరువును పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, చెరువును రక్షిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. పొలాలకు వెళ్లే దారుల కోసం కొంతమంది సర్వే చేస్తున్నారని, ఆ దారులను పట్టాదారు పాస్‌బుక్‌లో భూమిగా నమోదు చేయకుండా చూడాలని కోరారు.కిష్టాపురం గ్రామంలోని సర్వే నంబర్ 263లో 721 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా, 811 ఎకరాలు పంపిణీ చేసినట్లు నమోదైందని రైతులు తెలిపారు. 90 ఎకరాల అదనపు కేటాయింపుపై విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, విద్యుత్ శాఖ ఎస్ ఇ శ్రీనివాస చారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

## - మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

- సత్తుపల్లి మునిసిపల్ పరిధిలో రూ.1.83 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- రూ.40 లక్షలతో కమ్యూనిటీ హాల్‌కి శంకుస్థాపన, రూ.1.43 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభించిన మంత్రి



**ఖమ్మం, ఆగస్టు 20, నేటి శుభోదయ :** ప్రజారోగ్యం, విద్యారంగాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ. 1.83 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, పట్టణ పేదలకు నాణ్యమైన ఉచిత ప్రాథమిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఎన్టీఆర్ నగర్‌లో రూ. 1.43 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. హెల్త్ సెంటర్ కావాల్సిన వైద్యాధికారులు, సిబ్బంది నియామకానికి చర్యలు చేపడతామన్నారు.అలాగే శివసాయి నగర్‌లో రూ. 40 లక్షల నిధులతో నిర్మించనున్న మల్టీపర్పస్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల సామాజిక కార్యకలాపాలకు, శుభకార్యాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.

# నేడు ఖమ్మంకు ముఫ్తీ ఫారూఖ్ సాహబ్ మదనీ ప్రొసెసర్ హదీస్ దారుల్ ఉలూమ్ ఫలాహే దారైన్ రాక

- హాఫిజ్ మహమ్మద్ అహ్మద్ సహాబ్ రహేమతుల్లా అలై కుటుంబ సభ్యులకు పరామర్శ
- ఖమ్మం కాల్వ ఒడ్డులో గల మదర్సా దారుల్ ఉలూమ్ లో హాఫిజ్ మహమ్మద్ అహ్మద్ సహాబ్ రహేమతుల్లా అలై సంస్మరణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొననున్న ముఫ్తీ ఫారూఖ్ సాహబ్ మదని
- వివరాలు వెల్లడించిన హాఫీజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్



**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** హాఫిజ్ మహమ్మద్ అహ్మద్ సహాబ్★ రహేమతుల్లా అలై గత 50 ఏండ్లుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొలి మత గురువుగా విశేష సేవలు అందించి ఇటీవల పరమ పదించారు. ఈ వార్త తెలుసుకున్న ముఫ్తీ ఫారూఖ్ సాహబ్ మదనీ ప్రొసెసర్ హదీస్ దారుల్ ఉలూమ్ ఫలాహే దారైన్ (తర్కేసర్ గుజరాత్) ఈనెల 21 వ తేదీన ఖమ్మం జిల్లా కేంద్రానికి రానున్నారని హాఫీజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులను పరార్శించి సానుభూతిని వ్యక్తపర్చనున్నారని తెలిపారు. అనంతరం ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల హలీమా ఖాతూన్ మస్జిద్ లో జుమ్మా నమాజు కు ముందు మధ్యాహ్నం 12.50 గంటలకు ఆయన ప్రసంగం ఉంటుందని, అనంతరం సాయంత్రం ఖమ్మం కాల్వ ఒడ్డు లో గల మదర్సా దారుల్ ఉలూమ్ లో మగరిబ్ నమాజు అనంతరం జరిగే హాఫిజ్ మహమ్మద్ అహ్మద్ సహాబ్ రహేమతుల్లా అలై సంస్మరణ సభలో ఆయన సేవలను కొనియాడుతూ ప్రసంగించనున్నారు. ఈ ఆధ్యాత్మిక సమావేశాన్ని , మత పెద్దలు, ముఫ్తిలు ధార్మిక పండితులు హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

# డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్‌కు మణికొండకు పరుగులా?

- షాద్‌నగర్‌లోనే ఆన్‌లైన్ అప్రూవల్ కేంద్రం ఏర్పాటు చేయాలి
- ప్రజల సమయం, డబ్బు వృథా చేస్తున్న అధికారుల విధానంపై తీవ్ర అసంతృప్తి




**షాద్‌నగర్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** గడువు ముగిసిన డ్రైవింగ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకునేందుకు షాద్‌నగర్ ఆర్టీవో కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్న ప్రజలకు కొత్త కష్టాలు ఎదురవుతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం అప్లికేషన్ నంబర్ అప్రూవల్ కోసం రంగారెడ్డి జిల్లా కార్యాలయం మణికొండకు స్వయంగా వెళ్లాల్సి వస్తోందని, షాద్‌నగర్ ఆర్టీవో కార్యాలయ సిబ్బంది చెబుతున్నారని వారు పేర్కొంటున్నారు.షాద్‌నగర్‌తో పాటు పరిసర గ్రామాలు, మండలాల నుంచి వచ్చే వాహనదారులు కేవలం ఒక చిన్న ప్రక్రియ కోసం సుదూర ప్రాంతమైన మణికొండకు వెళ్లాల్సి రావడం తీవ్ర ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు. ప్రయాణ ఖర్చులు, సమయం వృథా కావడంతో పాటు అక్కడికి వెళ్లిన తర్వాత కూడా పని వెంటనే పూర్తికాకపోవడంతో పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు."ఒక డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం ఇంత దూరం ఎందుకు వెళ్లాలి?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ సేవలను స్థానికంగానే అందించే అవకాశం ఉన్నప్పటికీ, అనవసరంగా జిల్లా కార్యాలయానికి పంపడం వల్ల వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పలుమార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితం శూన్యం

షాద్‌నగర్ ఆర్టీవో కార్యాలయంలోనే గడువు ముగిసిన డ్రైవింగ్ లైసెన్స్‌ల రెన్యువల్‌కు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ నంబర్ అప్రూవల్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో పాటు సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రజల సమస్యను అధికారులు పట్టించుకోకపోవడం వల్లే పరిస్థితి ఇంతవరకు వచ్చిందని వారు అంటున్నారు. ప్రభుత్వం డిజిటల్ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్న సమయంలో, ఒక చిన్న అప్రూవల్ ప్రక్రియ కోసం ప్రజలను సుదూర ప్రాంతాలకు పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

### ఇకనైనా అధికారులు స్పందించాలి

షాద్‌నగర్ ప్రాంత ప్రజల ఇబ్బందులను, వారి సమయాన్ని, ప్రయాణ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని షాద్‌నగర్ ఆర్టీవో కార్యాలయంలోనే డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్‌కు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ నంబర్ అప్రూవల్ కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.మణికొండలోని జిల్లా కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా షాద్‌నగర్‌లోనే ఈ ప్రక్రియ పూర్తయ్యేలా తగిన సాంకేతిక, పరిపాలనా సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.ప్రజల సమస్యలను అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని పలువురు హెచ్చరిస్తున్నారు."ప్రజలకు సేవ చేయాల్సిన కార్యాలయం.. ప్రజలను దూర ప్రాంతాలకు పంపించే కేంద్రంగా మారకూడదు. షాద్‌నగర్ ప్రజల ఇబ్బందులకు వెంటనే ముగింపు పలకాలి" అని వాహనదారులు స్పష్టం చేస్తున్నారు.

# కస్తూర్బా గాంధీ విద్యాలయ సమస్యలపై కలెక్టర్ దృష్టి సారించాలి



**వికారాబాద్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని యువజన సంఘాల సభ్యులు ఆరోపించారు. సమస్యలపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారికి ఫిర్యాదు చేసి, కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని స్వయంగా తనిఖీ చేయాలని కోరినప్పటికీ, కలెక్టర్‌ను సమస్యలు లేని ఆశ్రమ పాఠశాలకు తీసుకెళ్లడంపై యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆడపిల్లలు చదువుతున్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా ఇతర పాఠశాలను సందర్శించడం వల్ల సమస్యలు వెలుగులోకి రావని వారు పేర్కొన్నారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఆందోళనకరమన్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయ ప్రత్యేక అధికారికి రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, దీంతో సమస్యలపై ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని యువకులు ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు లోనుకాకుండా విద్యార్థినుల సమస్యలను ప్రాధాన్యంగా పరిగణించాలని కోరారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థినులతో నేరుగా మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకోవాలని యువజన సంఘాల సభ్యులు కోరారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

# సదరన్ కౌన్సిల్ సమావేశం వేదికగా తెలంగాణ ప్రయోజనాలపై లేఖల ద్వారా మంత్రి తుమ్మల విజ్ఞప్తులు

- భద్రాచలం పరిసర 5 గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని కేంద్రమంత్రిని కోరిన మంత్రి తుమ్మల
- ఆయిల్ పామ్ గెలల ధర 25000 గా నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కోరిన మంత్రి తుమ్మల
- పెద్దవాగు పునరుద్ధరణకు నిధులు విడుదల చేయాలని, భద్రాచలం – ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలని చంద్రబాబును కోరిన మంత్రి తుమ్మల






**ఖమ్మం, ఆగస్టు 20, నేటి శుభోదయ :** కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా అధ్యక్షతన మహాబలిపురంలో జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న ఈ సమావేశంలో తెలంగాణ తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర విభజనతో మిగిలిన అంశాల పరిష్కారం, అంతర్రాష్ట్ర సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది.సమావేశానికి హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పలు కీలక అంశాలపై లేఖల ద్వారా విజ్ఞప్తులు చేశారు. ముఖ్యంగా భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయడం, పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటా నిధులు అందించడం, ఆయిల్‌పామ్ రైతులకు కనీస హామీ ధర కల్పించడం, భద్రాచలం–ఏలూరు అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రంపై ఒత్తిడి తేవడం వంటి అంశాలపై మంత్రి వారిని కల్సి విజ్ఞప్తి చేశారు.

### భద్రాచలం పరిసర ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలి

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భద్రాచలం పట్టణానికి భౌగోళికంగా, పరిపాలనాపరంగా అత్యంత సమీపంలో ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లోనే కొనసాగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీల పరిధిలోని 19 రెవెన్యూ గ్రామాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తిరిగి విలీనం చేయాలని కోరారు. ఈ గ్రామాల మొత్తం భౌగోళిక విస్తీర్ణం 11,122.01 ఎకరాలుగా లేఖలో పేర్కొన్నారు.ప్రస్తుతం ఈ గ్రామాలు తెలంగాణ భూభాగాల మధ్య, గోదావరి నది, రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల మధ్య ఒక ప్రత్యేక భౌగోళిక పరిస్థితిలో ఉండటంతో ప్రజలకు పరిపాలనా సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం సుమారు 282 కిలోమీటర్ల దూరంలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉందని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు, నిత్యావసర వస్తువుల రవాణాలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల కారణంగా గిరిజన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అదేవిధంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దులకు సమీపంలో, గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో పోలీసు, భద్రతా వ్యవస్థల మధ్య సమన్వయానికి కూడా ప్రస్తుత భౌగోళిక పరిస్థితి సమస్యగా మారుతోందని మంత్రి తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం తెలంగాణలో ఉండగా, ఆలయానికి సంబంధించిన గణనీయమైన భూములు పురుషోత్తపట్నంలో ఉండటం వల్ల ఆలయ పరిపాలనలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ అంశంపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను జోక్యం చేసుకొని, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ అనంతరం ఏర్పడిన భౌగోళిక అసమానతను సరిదిద్దేలా ఐదు గ్రామ పంచాయతీలను, వాటి పరిధిలోని 19 రెవెన్యూ గ్రామాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తిరిగి చేర్చే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి కోరారు. ఇదే అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కూడా మంత్రి విజ్ఞప్తి చేశారు.

### పెద్దవాగు ప్రాజెక్టు పునరుద్ధరణకు ఏపీ వాటా నిధులు ఇవ్వాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెద్దవాగు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు 2024 జూలై 18న కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో శాశ్వత పునరుద్ధరణ పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటా నిధులను వెంటనే అందించాలని మంత్రి తుమ్మల కోరారు.ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 16,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుండగా, అందులో 13,640 ఎకరాలు ఆయకట్టు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని, ప్రాజెక్టు దెబ్బతిన్న వెంటనే తెలంగాణ ప్రభుత్వం రింగ్‌బండ్ నిర్మాణం సహా తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టి రెండు రాష్ట్రాల ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకుందని తెలిపారు. అయితే శాశ్వత పునరుద్ధరణకు రూ.92.20 కోట్లు అంచనా వేయడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్‌లోనే 85.25 శాతం ఆయకట్టు ఉన్నందున, శాశ్వత పునరుద్ధరణ వ్యయాన్ని నిష్పత్తి ప్రాతిపదికన పంచుకొని అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి చంద్రబాబు నాయుడిని కోరారు. ఈ అంశంపై గత ఫిబ్రవరిలోనే విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్ణయం పెండింగ్‌లో ఉందని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఆయిల్‌పామ్ రైతులకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర

ఆయిల్‌పామ్ సాగు రైతుల ఆదాయ భద్రత కోసం ఆయిల్ పామ్ గెలల (ఎఫ్ ఎఫ్ బి ఎస్) టన్నుకు కనీస హామీ ధర రూ.25,000గా నిర్ణయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా సహకరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఆయిల్‌పామ్ సాగులో ప్రారంభ పెట్టుబడి అధికంగా ఉండటంతో పాటు పంటకు ఆదాయం రావడానికి ఎక్కువ కాలం పడుతుందని, అంతర్జాతీయ క్రూడ్ పామ్ ఆయిల్, ఎడిబుల్ ఆయిల్ ధరల్లో హెచ్చుతగ్గులు రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతున్నాయని మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ దేశంలో ప్రముఖ ఆయిల్‌పామ్ సాగు రాష్ట్రంగా ఉండగా, తెలంగాణలోనూ జాతీయ ఎడిబుల్ ఆయిల్స్ మిషన్–ఆయిల్‌పామ్ (ఎన్‌ఎంఈఓ – ఓపి) కింద సాగు విస్తీర్ణం వేగంగా పెరుగుతోందని పేర్కొన్నారు.రూ.25 వేల కనీస హామీ ధరతో పాటు సాగు వ్యయానికి అనుసంధానమైన కాలానుగుణ సవరణ విధానం అమలైతే రైతులకు స్థిరమైన, గిట్టుబాటు ఆదాయం లభించడంతో పాటు అంతర్జాతీయ ధరల ఒడిదుడుకుల నుంచి రక్షణ లభిస్తుందని, దేశంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు రైతుల్లో విశ్వాసం పెరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర ఆయిల్‌పామ్ సాగు రాష్ట్రాల సమన్వయంతో కేంద్రంపై ఒత్తిడి తేవాలని చంద్రబాబును కోరారు.

### భద్రాచలం–ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలి

తెలంగాణలోని భద్రాచలం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు వరకు చింతలపూడి, దమ్మపేట మీదుగా వెళ్లే రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించి, మంజూరు చేసేలా కేంద్ర రహదారులు–రవాణా శాఖపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఒత్తిడి తేవాలని మంత్రి తుమ్మల ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరారు.సుమారు 160–165 కిలోమీటర్ల పొడవు కలిగిన ఈ అంతర్రాష్ట్ర రహదారి మార్గం ప్రధానంగా మారుమూల, గిరిజన ప్రాంతాల గుండా సాగుతుందని, మార్కెట్లు, వైద్యం, విద్య, ఉపాధి అవకాశాలకు మెరుగైన ప్రాప్యత కల్పిస్తుందని తెలిపారు. ఈ రహదారిలో గణనీయమైన భాగం ఆంధ్రప్రదేశ్‌లో ఉండటంతో ఆ రాష్ట్రానికి కూడా ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.భద్రాచలం వద్ద ఎన్ హెచ్ –30ను, ఏలూరు వద్ద ఎన్ హెచ్ –16ను అనుసంధానించే కీలక మార్గంగా ఈ రహదారి ఉపయోగపడుతుందని, అశ్వారావుపేట–జీలుగుమిల్లి ప్రాంతంలోని జాతీయ రహదారి నెట్‌వర్క్‌తో అనుసంధానం ద్వారా రెండు రాష్ట్రాల మధ్య రవాణా, ప్రాంతీయ కనెక్టివిటీ మరింత బలోపేతం అవుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్దతు ఇవ్వడం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ రహదారి హోదా, మంజూరుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు.

## మధిర మున్సిపాలిటీ పరిధిలోని విజయవాడ రోడ్ లో గల

# డొంక అక్రమణలను తొలగించాలి

### - సిపిఐ నాయకులు బెజవాడ రవి




**ఖమ్మం, ఆగస్టు 20, నేటి శుభోదయ :** మధిర నుండి ఇల్లందులపాడు మీదుగా దెందుకూరు వరకూ ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకొని ఉన్న 100 అడుగుల డొంక రోడ్డును ఆక్రమణదారులనుండి రక్షించాలని సిపిఐ జిల్లా నాయకులు బెజవాడ రవి అధికారులను డిమాండ్ చేశారు. ఈ డొంక రోడ్డును కొంతమంది ఆక్రమణదారులు ఆక్రమించుకొని వ్యాపార సముదయాలను నిర్మించుకొన్నారని, ఇంకొంతమంది వారి భూమి హద్దులు మార్చి రాళ్లుపాతి ఆక్రమించుకొన్నారని బెజవాడ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయమై గతంలో సిపిఐ నాయకత్వం జిల్లా అధికారులదృష్టికి తీసుకెళ్లి జిల్లా సర్వేయర్ తోఆగస్టు 2023 లో సర్వే చేపించి ఆక్రమణలో ఉన్న భూమిని గుర్తించి నా అటు మండల అధికారులుకాని, మధిరమున్సిపాలిటీ పాలకవర్గాలు, అధికారులు కానీ పట్టించుకోకపోవడం దారుణం అని అన్నారు.ఈ ఆక్రమణలు మధిర మున్సిపాలిటీగా మారినతర్వాత విచ్చలవిడిగా జరుగుతున్నాయని పాలకవర్గాలలోని కొందరు, అధికారులు కొందరు కుమ్మక్కయి ఆక్రమణదారులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని అప్పనంగా కబ్జా చేస్తున్నారని విమర్శించారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడాల్సిన డొంక రోడ్డును తక్షణమే సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని ప్రజావాణి కార్యక్రమంలో సిపిఐ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఇంకా అధికారులు సదరు ఆక్రమణలోఉన్న డొంక ను స్వాధీనం చేసుకోపోతే ,ఇళ్ల స్థలాల కోసం గత రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పేదప్రజలను, ఇంటి స్థలంకోసం పోరాటంచేస్తున్న పేద జర్నలిస్టు సోదరులను కలుపుకొని మధిర పట్టణ సిపిఐ నాయకత్వం మరో భూపోరాటానికి పిలపిస్తుందని ఈ సందర్భంగా అధికారులను హెచ్చరించారు.

## ఘనంగా తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం జెండా ఆవిష్కరణ



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండాపూర్ గోప్యతండా గ్రామంలో తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం జెండాను ఘనంగా ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో, రాష్ట్ర కమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంఘం నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బడేసాబ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ షరీఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ రహీం, షాదుల్లా, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సయ్యద్ ముఖిమ్ పాల్గొన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మౌలానా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ కరీం, సలహాదారు ఎస్.డి. చంద్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని సంఘం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు.సంఘం జెండా ఆవిష్కరణ అనంతరం నాయకులు మాట్లాడుతూ తురక కాశ సామాజిక వర్గం అభివృద్ధి, ఐక్యత, సంక్షేమం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయిలో ప్రజలను సంఘటితం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గోప్యతండా గ్రామ ప్రజలు, సంఘం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

### : సైంటిఫిక్ స్టడీ ఫోరం వ్యవస్థాపకులు చారువాక



**వరంగల్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడుతూ సమాజంలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని సైంటిఫిక్ స్టడీ ఫోరం వ్యవస్థాపకులు చారువాక, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పెండ్యాల సుమన్ తెలిపారు.గురువారం హనుమకొండ నగరంలోని కాకతీయ యూనివర్సిటీ ప్రాంతంలో సమ్మయ్య నగర్ నందు వారి కార్యాలయంలోఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 20వ తేదీని వైజ్ఞానిక దృక్పథ దినోత్సవంగా నిర్వహించుకోవడం వెనుక శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని సమాజంలో విస్తృతంగా పెంపొందించాలనే లక్ష్యం ఉందన్నారు. మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ నరేంద్ర దభోల్కర్‌ను ఈ సందర్భంగా స్మరించుకోవాలని పేర్కొన్నారు.శాస్త్రీయ దృక్పథం అంటే కేవలం విజ్ఞానశాస్త్ర పుస్తకాలు చదవడం, పట్టాలు పొందడం మాత్రమే కాదని, ప్రతి విషయాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవడమేనని తెలిపారు. ఏదైనా విషయాన్ని విన్న వెంటనే గుడ్డిగా నమ్మకుండా దానికి సంబంధించిన ఆధారాలను పరిశీలించి, తార్కికంగా ఆలోచించి నిజానిజాలను తెలుసుకోవాలని సూచించారు.భారత రాజ్యాంగంలోని 51వ అధికరణలోని (హెచ్) ఉపనిబంధన ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, జిజ్ఞాసను, సంస్కరణల పట్ల తపనను పెంపొందించుకోవడం ప్రాథమిక విధిగా పేర్కొనబడిందని వారు తెలిపారు.ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ తదితర మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారం, పుకార్లు వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని చారువాక, పెండ్యాల సుమన్ సూచించారు. ఏ విషయాన్నైనా పరిశీలించకుండా నమ్మడం వల్ల సమాజంలో మూఢనమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని, స్వతంత్ర ఆలోచనను పెంపొందించాలని తెలిపారు. శాస్త్రీయ ఆలోచనతోనే సమాజం మూఢనమ్మకాల నుంచి బయటపడి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో విస్తృతంగా పెంపొందించడం ద్వారా సమాజాన్ని మరింత చైతన్యవంతం చేయడమే తమ లక్ష్యమని సైంటిఫిక్ స్టడీ ఫోరం వ్యవస్థాపకులు చారువాక, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పెండ్యాల సుమన్ తెలిపారు.

## రాజీవ్ గాంధీ సేవలు దేశానికి చిరస్మరణీయం

### - డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి



**నేటి శుభోదయ, ఆగస్టు 20, నేటి శుభోదయ :** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను ఆమె స్మరించుకున్నారు.దేశాన్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ, సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు దేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. దేశంలో టెలికాం, కంప్యూటర్ రంగాల విస్తరణకు రాజీవ్ గాంధీ తీసుకున్న చర్యలు భవిష్యత్ భారత నిర్మాణానికి బాటలు వేశాయని తెలిపారు.పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు ఓటు హక్కు కల్పించడం వంటి కీలక నిర్ణయాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాజీవ్ గాంధీ కృషి చేశారని ఆమె గుర్తుచేశారు. దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.రాజీవ్ గాంధీ ఆశయాలను, ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ హఫీజ్,సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, కౌన్సిలర్ లు గడ్డం రాజు, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు

## అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలి

**ఖమ్మం, ఆగస్టు 20, నేటి శుభోదయ :** రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)ల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విషయంలో జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని హైకోర్టు స్పష్టం చేసింది. అన్ని అర్హులున్న టీడబ్ల్యూజేఎఫ్ కు అక్రెడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలను ఏర్పాటు చేసే సమయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు ప్రాతినిధ్యం ఇవ్వకుండా వ్యవహరించడాన్ని సవాల్ చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌పై గత ఆరు నెలలుగా పలుమార్లు విచారణ జరిగింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ కార్యాలయ న్యాయవాదులు, పిటిషనర్ తరపున న్యాయవాదులు తమ వాదనలు కోర్టు ముందు వినిపించారు.ఇరుపక్షాల వాదనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విధానం, జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యానికి సంబంధించిన నిబంధనలను పరిశీలించిన అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ మొహినుద్దీన్‌ల ధర్మాసనం సోమవారం తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఈ తీర్పుతో రాష్ట్రంలోని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు అధికారిక ప్రాతినిధ్యం లభించే మార్గం సుగమమైంది. జర్నలిస్టు సంఘాల మధ్య సమాన అవకాశాలు, పారదర్శకత, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యానికి ఈ తీర్పు దోహదపడుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హైకోర్టు తీర్పును తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్న తమ పోరాటానికి ఇది న్యాయపరమైన విజయమని పేర్కొంది. ఈ తీర్పును వెంటనే అమలు చేసి, అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంఘం నాయకులు కోరారు.ఈ తీర్పు భవిష్యత్తులో మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటులో అన్ని గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా మార్గదర్శకంగా నిలుస్తుందని జర్నలిస్టు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. న్యాయం, ధర్మం తమవైపు ఉందని, హైకోర్టు ఇచ్చిన తీర్పు తమ సంఘం సభ్యుల విజయం అని రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు.

## పరిసరాల శుభ్రతే దోమల నివారణకు మార్గం



**ఖమ్మం, ఆగస్టు 20, నేటి శుభోదయ :** ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తమఇంటిని చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచడం వలన దోమలను నివారించ వచ్చని ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా అన్నారు. గురువారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా జువాలజీ విభాగం విద్యార్థులు నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో కళాశాల విద్యార్థులకు సందేశాన్ని అందించారు. మలేరియా డెంగీ, వైరల్ జ్వరాలను అరికట్టడానికి దోమల నివారణే మార్గమన్నారు. కార్యక్రమంలో ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద,జువాలజి విభాగాధిపతి డా.చెంచురత్నయ్య, అధ్యాపకులు డా.బి.కవిత, బి.వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంజీఎంలో ఇదేం దుస్థితి..?

- రోగులతోనే పారిశుద్ధ్య పనులు..
- సూపరింటెండెంట్ పట్టించుకోవడంలేదా?



**వరంగల్ , ఆగస్టు 20, నేటి శుభోదయ :** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణపై మరోసారి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంటువ్యాధుల విభాగం వార్డుల్లో రోగులే చీపురు పట్టుకుని శుభ్రత పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొనడం ఆందోళనకు గురిచేస్తోంది.ఆసుపత్రిలో పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నప్పటికీ రోగులతోనే శుభ్రత పనులు చేయించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో వార్డులు, వరండాలను శుభ్రం చేయాల్సి రావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.సూపరింటెండెంట్ పట్టించుకోవడంలేదా..?ఎంజీఎంలో పారిశుద్ధ్య నిర్వహణపై ఇలాంటి పరిస్థితులు కనిపిస్తున్నప్పటికీ ఆసుపత్రి సూపరింటెండెంట్ తగిన స్థాయిలో దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వార్డుల్లో పరిశుభ్రత పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించి, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు.



**ఏన్కూర్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఏన్కూర్ మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ..... దేశాని కి సాంకేతిక నైపుణ్యాన్ని అందించడంలో పునాది వేసిన గొప్ప వ్యక్తి రాజీవ్ గాంధీ అని పలువురు కొనియాడారు .18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి అనేక సంస్కరణలు తీసుకొచ్చిన మహానుభావుడని అన్నారు. ఆధునిక భారతదేశ నిర్మాణములో రాజీవ్ గాంధీ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. భిన్నత్వంలో ఏకత్వం అనే దేశ సంప్రదాయాలను, విలువలను నిలబెట్టడానికి ఆయన ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ,నాయకులు రాజీవ్ గాంధీ బాటలోనే నడిచి ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9వ వార్డులో బోర్ వాటర్ నల్లాల ఫిట్టింగ్

### గ్రామపంచాయతీ సిబ్బందితో పనులు చేయిస్తున్న వార్డు సభ్యురాలు



**దిండి (గుండ్లపల్లి), ఆగస్టు 20, నేటి శుభోదయ :** దిండి మండలంలోని గుండ్లపల్లి గ్రామం 9వ వార్డులోని బొడ్రాయి వద్ద గ్రామపంచాయతీ బోరు నుంచి బోర్ వాటర్‌ను ప్రజలు ఉపయోగించుకునేలా నల్లాల ఫిట్టింగ్ పనులు చేపట్టారు. 9వ వార్డు సభ్యురాలు సపావత్ జానకమ్మ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బందితో నల్లాల ఫిట్టింగ్ పనులు చేయిస్తున్నారు.ఈ కార్యక్రమంలో జయపాల్ నాయక్‌తో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది గంగాధర్, జగతయ్య పాల్గొని పనుల్లో సహకరిస్తున్నారు. వార్డు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బోర్ వాటర్ సౌకర్యం కల్పించేందుకు నల్లాల ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## నిరుపయోగంగా మారిన వాకింగ్ ట్రాక్



**వికారాబాద్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** పట్టణంలోని 31వ వార్డులో అస్సాం బేకరీ వెనుక వీధి మరియు కే రాజయ్య ఇంటి వెనుక భాగంలో వాకింగ్ ట్రాక్ కోసం గత ప్రభుత్వ హయాంలో నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో ప్రస్తుతం ఆ ప్రదేశం నిరుపయోగంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఈ ప్రాంతాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు తగినంత శ్రద్ధ చూపడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం వాకింగ్ ట్రాక్ ప్రాంతం చెట్లు, చెత్తతో నిండిపోయి అపరిశుభ్రంగా మారింది. దీంతో దోమలు విపరీతంగా పెరిగి పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో పాములు సంచరిస్తుండటంతో వాకింగ్ ట్రాక్‌కు సమీపంలో నివసించే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.వివిధ వార్డుల్లో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలు, కనీస వసతులు అందుబాటులో లేకపోయినా, 31వ వార్డులో ఇప్పటికే వాకింగ్ ట్రాక్‌కు అనువైన విశాలమైన ప్రదేశం ఉండటం గమనార్హం. గతంలో వాకింగ్ ట్రాక్ అభివృద్ధి కోసం వెచ్చించిన నిధులు నిరుపయోగంగా మారకుండా, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి ప్రదేశాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేసి, అవసరమైన మౌలిక వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకొస్తే పరిసర ప్రాంత ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణంతో పాటు నడకకు అనువైన సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వారు పేర్కొంటున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 31వ వార్డులోని వాకింగ్ ట్రాక్‌ను తక్షణమే అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయంగా ఇనుమడింపజేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ



**పాల్వంచ, ఆగస్టు 20, నేటి శుభోదయ :** టెక్నాలజీ రంగంలో భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయంగా దేశ విదేశాల్లో చాటిచెప్పిన మహానాయకుడు రాజీవ్ గాంధీ అని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. భారత మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిసందర్భంగా గురువారం కొత్వాల నాయకత్వంలో, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రాజీవ్ కూరగాయల మార్కెట్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కొత్వాలతో పాటు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ భారతదేశ సాంకేతికతకు ఆధునిక పునాదులు వేసి, దేశంలోనే అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిన ఘనుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన నేత రాజీవ్ గాంధీ అని అన్నారు. ఆయన కుమారుడు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే కాంగ్రెస్ కార్యకర్తల ధ్యేయం అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు, కాంగ్రెస్ నాయకులు ఎస్.ఐ. జలీల్,మహిపతి రాములింగం, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న గౌడ్, నూకల రంగారావు, గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి, సాదం రామకృష్ణ, వై. వెంకటేశ్వరరావు, దారా చిరంజీవి, కాపర్తి వెంకటాచారి, బాలినేని నాగేశ్వరరావు, ఎస్.వి.ఆర్.కె. ఆచార్యులు, కటుకూరి శేఖర్, గంధం నరసింహారావు, మస్నా శ్రీనివాస రావు, సామా వెంకటరెడ్డి, చౌగాని పాపారావు, బూసి శ్రీను, లక్ష్మణ్, ఓలపల్లి రాంబాబు, లింగ్యా, షేక్ బాషా,బ్యాంక్ చారి,డిష్ నాగేశ్వరరావు, బోగిని సందీప్, ఎలకా నాగేశ్వర రావు, మార్కెట్ కమిటీ నాయకులు శివ,సందు ప్రభాకర్,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు రూ.39,373 కనీస వేతనం ఇవ్వాలి

### - TUCI ఆధ్వర్యంలో ధర్పల్లిలో ధర్నా.. అధికారులకు వినతిపత్రం




**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** కార్మికులకు నెలకు రూ.39,373 కనీస వేతనం చెల్లించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (TUCI) ఆధ్వర్యంలో గురువారం ధర్పల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా TUCI నిజామాబాద్ రూరల్–కామారెడ్డి సంయుక్త జిల్లా కార్యదర్శి ఆర్. రమేష్ మాట్లాడుతూ.. కార్మికులు, వారి కుటుంబాలు గౌరవప్రదంగా జీవించేందుకు సరిపోయేలా కనీస వేతనాలను నిర్ణయించాలని అన్నారు. ప్రస్తుత ధరలు, కుటుంబ అవసరాలను పరిగణనలోకి తీసుకుని శాస్త్రీయంగా కనీస వేతనం నిర్ణయించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు, పని సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరాల ఆధారిత వేతనం అందించాలని కోరారు. జీవన వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్ (VDA) ద్వారా పెరిగిన ఖర్చులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మే 2026 నాటి ధరలను పరిగణనలోకి తీసుకుని నెలకు రూ.39,373 కనీస వేతనం అమలు చేయాలని కార్మిక శాఖను కోరారు. అలాగే గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు ఖాతాల్లో జమ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని TUCI నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో TUCI ధర్పల్లి మండల అధ్యక్షుడు ఒడ్డేటి ఆశన్న, సిరికొండ మండల అధ్యక్షులు, నాయకులు సాయిలు, విలాస్, జగన్, వర్షిత్, సర్బుద్దిన్, శారద, సులోచన, సాయవ్వ, రాధ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## 27న జిల్లా కేంద్రంలో జరుగు ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల ధర్నాను విజయవంతం చేయండి

### - టీ ఎస్ యు టి ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు



**ఏన్కూర్ , ఆగస్టు 20, నేటి శుభోదయ :** ఈనెల 27వ తేదీన ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల టీజీ జెఏసి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ముందు చేపడుతున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని టీ ఎస్ యు టిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు కోరారు. ఏన్కూరు మండలంలోని తిమ్మారావుపేట,బురద రాఘవాపురం, ఏన్కూర్ కాంప్లెక్స్ సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్ చంద్, మూడ్ పుల్లయ్య, పిఆర్టియు నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు,టి జిటిటిఎఫ్ నాయకులు హతీరామ్,తఫాన్ సంఘ నాయకులు బి.సేవియా టిజీటిఎఫ్ నాయకులు నరసయ్య అధ్యక్షతన జరిగిన వివిధ కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయుల ఉద్దేశించి టీజీ జెఏసి నాయకులు మాట్లాడారు.సమస్యల పరిష్కారం కోసం టీజీ జెఏసి నాయకత్వంలో పోరాటాలకు పిలుపును ఇచ్చినందున పోరాట కార్యాచరణను విజయవంతం చేయాలని తెలియజేశారు. జూన్ రెండున ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రెండు నెలలు గడిచిన ప్రధాన డిమాండ్లు పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం ఈ హెచ్ ఎస్ సక్రమంగా అమలు కాకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈహెచ్ఎస్ ను సమర్థవంతంగా అమలు చేయాలని, రెండవ పి ఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించి అమలు చేయాలని, ఆరు పెండింగ్ డీఏల ను తక్షణమే విడుదల చేయాలని, సి పి ఎస్ ను రద్దు చేసి ఓ పిఎస్ విధానాన్ని అమలు చేయాలని, 2004 సెప్టెంబరు ఒకటో తేదీకి ముందు విడుదలైన నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన వారికి ఓ పిఎస్ అమలు చేయాలని కోరారు. విద్యాశాఖలో రేషలైజేషన్ కు సంబంధించిన జీవో 25ను సవరించాలని, టీచర్ల ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి అమలు చేయాలని, టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పండిట్స్ పిఈటీ పోస్టులను అప్గ్రేడ్ చేస్తూ పదోన్నతులు కల్పించాలని, సిఆర్ టి ల సర్వీసును క్రమబద్దీకరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 27న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, సెప్టెంబర్ 1 వ తేదీన విద్రోహ దినం నల్లబ్యాడ్జీ లతో నిరసన, సెప్టెంబర్ 10వ తేదీన హైదరాబాద్ లో మహాధర్న చేపడుతున్నట్లు తెలియజేశారు. అప్పటికి ప్రభుత్వం దిగి రాకపోతే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మారావుపేట కాంప్లెక్స్ హెచ్ ఎం రహీం బీ, ఏన్కూర్ కాంప్లెక్స్ హెచ్ఎం వాసవి దేవి, బురద రాఘవాపురం హెచ్ ఎం సుజాత, ఉపాధ్యాయులు శ్రీదేవి,సింగ్య,రమేష్, శంకర్రావు,పుల్లయ్య, రామారావు,రాఘవరావు, బి.నాగేశ్వరరావు, బి. నరసింహారావు, రవి లాల్, వెంకట నరసయ్య, రవికిరణ్, నరసింహారావు, సునీత, కుమారస్వామి, హీరా లాల్, భగవాన్ దాస్, శశికళ సునీత సోనాబాయి, వేణు, రమేష్, నరసింహరావు, ఝాన్సీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ యువ సేవా ప్రతినిధిగా ప్రవళిక యాదవ్ ఎంపిక



**కేశంపేట, ఆగస్టు 20, నేటి శుభోదయ :** కేశంపేట మండలం చింతకుంటపల్లి గ్రామానికి చెందిన పోచమోని ప్రవళిక యాదవ్ జాతీయ యువ సేవా ప్రతినిధిగా ఎంపికయ్యారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న యువ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆమెకు ఈ అవకాశం లభించింది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూక్‌నగర్, కేశంపేట మండలాల పరిధిలో యువతకు సంబంధించిన కార్యక్రమాలను సమన్వయం చేయడంలో ఆమె కీలకంగా వ్యవహరించనున్నారు.యువతను సామాజిక సేవ, సమాజ అభివృద్ధి, నాయకత్వ కార్యక్రమాల వైపు ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వ యువజన కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై యువతకు అవగాహన కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రవళిక కృషి చేయనున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతిగా జాతీయ స్థాయి యువ సేవా కార్యక్రమంలో అవకాశం దక్కడం పట్ల చింతకుంటపల్లి గ్రామ ప్రజలు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఎంపిక గ్రామానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. యువతలో సేవాభావం, బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ప్రవళిక చేస్తున్న కృషి మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలవాలని అభినందనలు తెలిపారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిరస్మరణీయుడు - దేప భాస్కర్ రెడ్డి



**మహేశ్వరం, ఆగస్టు 20, నేటి శుభోదయ :** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న, స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి జయంతి సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్, ప్రశాంత్ హిల్స్ డివిజన్ మరియు ఎన్టీఆర్ నగర్ డివిజన్లో నిర్వహించిన జయంతి వేడుకలల్లో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి, కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి, ఆధునిక భారత నిర్మాణానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు సామిడి గోపాల్ రెడ్డి ముప్పిడి లింగస్వామి గౌడ్, తలాటి రమేష్ నేత జ్ఞానేశ్వర్ యాదవ్ , పెద్దవూర సైదులు, నబి, మామిడి రామకృష్ణ గౌడ్, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వేముల రేణుక, దుబ్బాక శేఖర్, ప్రేమ్ నాయక్, మహమ్మద్, నరసింహ, అక్రమ్, యాదయ్య, శివ, రఫీ, సంతోష్, సమద్, మాధవి, రామ, పాషా, పటేల్ జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలల బంధు విజయవంతం

- జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరన్



**మంథని/కాటారం, ఆగస్టు 20, నేటి శుభోదయ :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని జీవో నెంబర్ 97 వెంటనే రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా బంధు పిలుపునివ్వడం జరిగింది. ఈ యొక్క బందుకు సంబంధించి ఎస్ఎఫ్ఐ భూపాల పల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాటారం మండలంలోని రుద్రారంలోని పాలిటెక్నిక్ కళాశాల బంధు విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు స్మరణ, కుమ్మరి రాజు మాట్లాడుతూ.....రాష్ట్రంలో ఉన్నటువంటి పాలిటెక్నిక్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడానికి నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని అన్నారు అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు సంబంధించి తీసుకువచ్చినటువంటి జీవో నెంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు దాంతోపాటు ఏదైతే ఇప్పుడు తీసుకువచ్చినటువంటి జీవో ఉందో దీని ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో హైర్ ఎడ్యుకేషన్ చదివే అవకాశం లేకుండా పోతుందని అన్నారు. దాంతోపాటు పాలిటెక్నిక్ కళాశాలలో చదివే విద్యార్థులను ఈ యొక్క జీవో ద్వారా లేబర్లుగా మార్చే పరిస్థితి ఉందని అన్నారు.దానిలో భాగంగా కళాశాలలో చదువుతున్న విద్యార్థికి ప్రతి ఒక్కరికి 50 వేల పైన ఫీజు కూడా వసూలు చేసే పరిస్థితి ఉంది తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని ఐటిఐ ఏటీసీలను వాటితో పాటు అనుసంధానం చేయడం అనే నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాటారం మండల నాయకులు సమీర్ యశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంథని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



**మంథని, ఆగస్టు 20, నేటి శుభోదయ :** మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనరేట్ ఏసీపీ మడత రమేష్ హాజరై పాలకవర్గ సభ్యులతో అభివృద్ధి, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ తదితర అంశాలపై చర్చించారు.పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా పాలకవర్గం చేసిన విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి 5 స్వచ్ఛ్ ఆటోలు కొనుగోలు చేసేందుకు సానుకూలంగా అంగీకరించారు. అలాగే వినాయక ఉత్సవాలు, గోదావరి పుష్కరాల సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, డ్రగ్స్ నియంత్రణపై ఏసీపీ మడత రమేష్ సూచనలు చేశారు.మున్సిపాలిటీ పరిధిలో వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంతలను స్టోన్ డస్ట్‌తో పూడ్చడం, అంబేద్కర్‌నగర్‌లో నూతన బోర్‌వెల్ ఏర్పాటు, 9వ వార్డులోని మహాలక్ష్మి దేవాలయ ఆవరణలో నూతన బోర్ మోటార్ కొనుగోలు, తాత్కాలిక మార్కెట్ వద్ద గ్రీన్ మ్యాట్ ఏర్పాటు తదితర అంశాలపై కౌన్సిల్‌లో చర్చించి ఆమోదం తెలిపారు.ఈ సమావేశంలో మంథని సీఐ బి. స్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు కుర్ర లింగయ్య, నూకల కమల్, మాచిడి రాజు గౌడ్, మద్దికట్ల స్రవంతి, లైశెట్టి రజిత, మారుపాక నిహారిక, పెంటరి రాజు, వేముల లక్ష్మి , యెల్లంకి వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లిలో సౌండ్స్ & డెకరేషన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక - మండల అధ్యక్షుడిగా సిహెచ్ లక్ష్మణ్



**తలకొండపల్లి, ఆగస్టు 20, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండల కేంద్రంలో సౌండ్స్ అండ్ డెకరేషన్ యజమానులు, నిర్వాహకుల ఆధ్వర్యంలో నూతనంగా యూనియన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంఘం అధ్యక్షుడిగా సి.హెచ్. లక్ష్మణ్ (వెల్జాల్),ఉపాధ్యక్షుడిగా పి. రామ్ (చౌదర్ పల్లి) ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా సి.హెచ్.శేఖర్ (చౌదర్ పల్లి), ప్రధాన కార్యదర్శిగా ఎల్.సుధాకర్ (వెల్జాల్), ప్రచార కార్యదర్శిగా తాండ్ర అనిల్ (వెంకటాపూర్) బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ..మండలంలోని సౌండ్స్ అండ్ డెకరేషన్ రంగంలో ఉన్న కార్మికులు,యజమానుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.యూనియన్ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సౌండ్స్ అండ్ డెకరేషన్ నిర్వాహకులు, సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మిడ్జిల్ మండల టీయూడబ్ల్యూజే (హెచ్-143) మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..



**మిడ్జిల్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** టీయూడబ్ల్యూజే (హెచ్–143) మహబూబ్ నగర్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో మిడ్జిల్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వరంగల్ శివకుమార్, కో–కన్వీనర్ చింతకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల కమిటీని ప్రకటించారు

**- నూతన కమిటీ పదవులు**

అధ్యక్షుడు – బాల్ రెడ్డి (సాక్షి) ప్రధాన కార్యదర్శి – శ్రీనివాసులు ( దిశా ) ఉపాధ్యక్షులుగా,భీమ్ రాజ్ (జనం సాక్షి) షేక్ సలీం( జనం స్ఫూర్తి )నర్సింలు (ప్రజా ప్రతిభ ), కోశాధికారి.. బాల నారాయణ ( నేటి దర్శిని ) సంయుక్త కార్యదర్శి – వరుణ్ (నమస్తే తెలంగాణ)ప్రచార కార్యదర్శి – ఎర్రోళ్ల మల్లేష్ (వెలుగు)

**- కార్యనిర్వాహక సభ్యులు**

సి రాఘవేందర్( మనం) ఎస్.రమేష్, (మెట్రో ఈవినింగ్ ) రవీందర్ రెడ్డి (గిరిజన సంస్కృతి) కార్యక్రమంలో జిల్లా నరేందర్ చారి, నరేందర్ గౌడ్, కృష్ణ యాదవ్ తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

అంతకుముందు ముందు అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో మిడ్జిల్ మండల సభ్యులకు యూనియన్ సభ్యత్వ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన మిడ్జిల్ మండల కమిటీకి అడ్‌హక్ కమిటీ నాయకులకు. అభినందనలతెలియజేస్తూ, పాత్రికేయుల హక్కుల పరిరక్షణకు, సంఘ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## టీబి ముక్త భారత్ పై స్పెషల్ ఆఫీసర్లకు శిక్షణ




**నిజామాబాద్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని క్షయ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రత్యేక అధికారులకు టిబి ముక్తభారత్ అభియాన్ పై ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఐడిసి సమావేశ మందిరంలో నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ అండ్ జిల్లా మేజిస్ట్రేట్ భవిష్ మిస్రా,అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ..క్షయ వ్యాధిగ్రస్తులకు ఇచ్చే పోషకాహార పారితోషము (డిబిటి)ను జనవరి నుండి జూన్ వరకు మంజూరైన నిధులను 100% పూర్తి చేయాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు కేవలం 47% మాత్రమే పూర్తి చేసినందున మిగతాది త్వరలోనే పూర్తి చేయాలని సూచించారు.అదే విధంగా 126 క్షయ వ్యాధిగ్రస్తులకు ఆధార్ లింకు బ్యాంక్ అకౌంట్ లేనందు వల్ల డిబిటి తిరస్కరించడం జరిగింది.కావున వారిని కూడా ఆధార్ లింక్ బ్యాంక్ అకౌంట్ లను చేయించి డిబిటి నీ ఇవ్వాలన్నారు.అన్ని మండలాలలో ఉన్న ప్రత్యేక అధికారుల సహాయ సహకారాలతో స్వచ్ఛంద సేవా సంస్థలను మోటివేట్ చేస్తూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్లు ఇచ్చే లాగా చూడాలన్నారు.క్షయ వ్యాధిపై వివరణత్మకమైన సమాచారం కంటే క్షేత్రస్థాయిలో సాధించిన లక్ష్యం మరియు ఎదురైన అవరోధాలను దృష్టిలో ఉంచుకొని మిగతా లక్ష్యాన్ని సాధించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.రాజేశ్వరి మాట్లాడుతూ..జిల్లాలో ప్రస్తుతం 975 క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని,ప్రతి మండలంలో ఉన్న స్పెషలాఫీసర్,ఐదుగురు ఎన్సిసి వాలంటీర్లు మరియు ఐదుగురు మేరా యువ భారత్ వాలంటీర్లతో కలిపిఆ మండలంలో ఉన్న క్షయ వ్యాధిగ్రస్తుల పై దృష్టి సారించాలన్నారు.ప్రతి ఒక్క ఉద్యోగి ఒక క్షయ వ్యాధిగ్రస్తుడికి పోషకాహార కిట్టును ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు.టీబీ ఎంబీఏ 1.0 2025లో జనవరి నుండి జూన్ వరకు 97% చికిత్స పూర్తయిందని అన్నారు.నిక్షయ్ పోర్టల్ ను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని,నిక్షయ్ మిత్రలో సైకో సోషల్ మిత్ర,న్యూట్రిషన్ సపోర్ట్ మిత్ర,డయాగ్నోసిస్ సపోర్ట్ మిత్ర గా నమోదు చేయాలన్నారు.ఆ తర్వాత క్షయ వ్యాధికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని పిపిటి ద్వారా డిటిసి ఓ డాక్టర్ దేవీ నాగేశ్వరి చెప్పడం జరిగింది.ఇంకా ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి సాయన్న,జడ్పీ సీఈవో సాయా గౌడ్,డిఐఓ డాక్టర్ అశోక్,జిల్లా ఉప వైద్యాధికారి నిజాంబాద్ డివిజన్ డాక్టర్ సికందర్ నాయక్,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న,డాక్టర్ సుప్రియ,డాక్టర్ వెంకటేష్,డాక్టర్ నవ్య,వివిధ మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడాలి.. కబ్జాను అడ్డుకోవాలి

**కేశంపేట, ఆగస్టు 20, నేటి శుభోదయ :** కేశంపేట మండలంలోని మంగళగూడ గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పరిధిలోని 140 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని గత ఏడాది ప్రభుత్వ సర్వేయర్ ద్వారా అధికారికంగా సర్వే చేసి, హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నీటి నిల్వ కోసం అదే భూమిలో గుంతను తవ్వారు. అయితే, పక్కనే ఉన్న 134 సర్వే నంబర్‌లో పట్టా భూమి కలిగిన రైతు ఎలాంటి అధికారిక సర్వే లేకుండానే నీటి నిల్వ గుంతను పూడ్చివేసి, ప్రభుత్వ భూమిలో కడ్డీలు ఏర్పాటు చేస్తున్నారని గ్రామ సర్పంచ్ ఆరోపించారు.ఈ విషయాన్ని సర్పంచ్ సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లినప్పటికీ, అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వే నంబర్లను నిర్ధారించి, ప్రభుత్వ భూమికి ఉన్న హద్దులను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా శాఖాపరమైన అధికారులు చర్యలు తీసుకోవాలని పత్రికాముఖంగా విజ్ఞప్తి చేస్తున్నారు.



# 100 డయల్ దుర్వినియోగం.. 4 రోజుల జైలు

**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** అత్యవసర పోలీసు సేవల కోసం ఉద్దేశించిన '100 డయల్' వ్యవస్థను దుర్వినియోగం చేసిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించిన సంఘటన ధర్పల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై జి.సందీప్ తెలిపిన వివరాల ప్రకారం... ధర్పల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన రాచర్ల రాజు అనే వ్యక్తి అత్యవసరం లేకపోయినా 100 డయల్‌కు ఉద్దేశపూర్వకంగా కాల్ చేసి దుర్వినియోగానికి పాల్పడ్డాడు. దీనిపై స్పందించిన పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి, గురువారం జిల్లా కేంద్రంలోని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ముందు హాజరుపరిచారు. కేసు విచారణ అనంతరం నిందితుడు రాచర్ల రాజుకు 4 రోజుల జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.ఈ సందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ... అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు 100 డయల్ వ్యవస్థ నిరంతరం పనిచేస్తుందని, ఎలాంటి కారణం లేకుండా అనవసరంగా కాల్ చేసి సమయాన్ని వృథా చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి, అత్యవసర సమయాల్లో మాత్రమే పోలీసు సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.




# క్యూర్ కానీ మెడిక్యూర్.. వైద్య సేవలపై పెరుగుతున్న ఆందోళన..!

- **చికిత్సలో నిర్లక్ష్యంపై ఆరోపణలు..**
- **పోలీస్ శాఖకు చెందిన వ్యక్తి మృతితో మరింత చర్చ.**
- **ఆసుపత్రి నిర్వహణపై సమగ్ర విచారణ జరపాలని ప్రజల డిమాండ్**

**వికారాబాద్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** వికారాబాద్ పట్టణంలోని మెడిక్యూర్ హాస్పిటల్‌లో వైద్య సేవల నిర్వహణ, అత్యవసర చికిత్స అందించే విధానంపై పలు ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎదురవుతున్న పరిస్థితులపై పట్టణ ప్రజల్లో ఆందోళన పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పోలీస్ శాఖకు చెందిన వ్యక్తి ఆసుపత్రిలో మృతి చెందిన ఘటన కూడా చర్చనీయాంశంగా మారింది.




### సమాచారం ఇవ్వడంలో స్పష్టత ఏది?

మృతి ఘటనకు సంబంధించిన వాస్తవాలను తెలుసుకునేందుకు బాధ్యతగల జిల్లా రిపోర్టర్ ఆసుపత్రి వర్గాలను సంప్రదించినప్పటికీ, ఘటనపై పూర్తి వివరాలు వెల్లడించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. రోగి పరిస్థితి, అందించిన చికిత్స, అత్యవసర సమయంలో తీసుకున్న చర్యలు తదితర అంశాలపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. అయితే ఈ విషయాలపై ఆసుపత్రి యాజమాన్యం తమ వాదనను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.

### గతంలోనూ వివాదాల ఆరోపణలు

మెడిక్యూర్ హాస్పిటల్‌కు సంబంధించి గతంలోనూ పలు వివాదాస్పద ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు, ఆసుపత్రి వ్యవహారాలపై అవగాహన ఉన్న పలువురు పేర్కొంటున్నారు. ఒక సందర్భంలో ఆసుపత్రిపై దాడి జరిగిన ఘటన కూడా ఉందని వారు గుర్తుచేస్తున్నారు. అయితే గత ఘటనలపై వచ్చిన ఆరోపణలు, ప్రస్తుత పరిణామాలపై సంబంధిత అధికారులు, ఆసుపత్రి యాజమాన్యం వాస్తవాలను స్పష్టం చేయాల్సి ఉంది.

### కుటుంబ సభ్యుల ఆరోపణలు నిజమేనా?

ఇటీవల మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులు సరైన సమయంలో వైద్యం అందలేదని, అవసరమైన సదుపాయాలు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ ఆరోపణలు నిజమా? కాదా? అన్నది వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేస్తేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### ప్రజల్లో భయం ఎందుకు?

ఒక ఆసుపత్రిపై ప్రజల్లో విశ్వాసం తగ్గి, అక్కడికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడితే అది తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని వికారాబాద్ వాసులు పేర్కొంటున్నారు. అత్యవసర చికిత్సలో ఆలస్యం, వైద్య సేవల్లో లోపాలు, అవసరమైన సదుపాయాల కొరత వంటి ఆరోపణలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### తక్షణమే తనిఖీలు చేపట్టాలి

ప్రజల ప్రాణాలతో ముడిపడిన వైద్య సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా మెడిక్యూర్ హాస్పిటల్ నిర్వహణ, వైద్య సిబ్బంది అందుబాటు, అత్యవసర చికిత్సా విధానం, అవసరమైన వైద్య పరికరాలు, రోగులకు అందుతున్న సేవలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమగ్ర తనిఖీ నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే వాస్తవాలను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని కోరుతున్నారు.

వైద్యం అంటే నమ్మకం.. ఆ నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ఆసుపత్రి యాజమాన్యంతో పాటు సంబంధిత అధికారులపై ఉంది.

# పత్తి, వరి పంటలపై రైతులకు అవగాహన

## - మండల వ్యవసాయ అధికారి దండెం విజయ్ చంద్ర



**షాబాద్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** షాబాద్ మండల పరిధిలో ని బోడంపహాడ్ గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించి, రైతులకు ఉచితంగా పంటల ఇన్‌పుట్స్ పంపిణీ చేశారు. షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర పత్తి, వరి పంటలను పరిశీలించి, సమతుల్య ఎరువుల వినియోగం, సూక్ష్మపోషకాల నిర్వహణ, తెగుళ్లు–పురుగుల సమగ్ర యాజమాన్యంపై రైతులకు సూచనలు చేశారు. ఎల్–నినో నేపథ్యంలో నేలలో తేమను సంరక్షిస్తూ అవసరమైనప్పుడు మాత్రమే నీటి యాజమాన్యం చేపట్టాలని సూచించారు.

# రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు శ్రీ కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గిరి నగర్ డివిజన్ ఇందిరా గాంధీ నగర్‌లో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను, యువతకు ప్రాధాన్యత నిస్తూ సాంకేతిక రంగంలో తీసుకొచ్చిన మార్పులను స్మరించుకున్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలు, దేశ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని శ్రీ కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులర్పించారు.

# స్మార్ట్ రేషన్ కార్డులపై కేంద్రం వాటాను విస్మరించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదు..

- కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది
- బిజెపి నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్, దేవులపల్లి మనోహర్ యాదవ్



**గజ్వేల్, ఆగస్టు 20, నేటి శుభోదయ :** SIR స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రెండో దశ గజ్వేల్ అసెంబ్లీ వివిధ మండలాల SIR ఇన్చార్జిలతో జరిగిన కార్యశాల అనంతరం మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని చూస్తోందని బిజెపి సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ విమర్శించారు. పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని పక్కనపెట్టి, రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిస్థాయిలో ఉచిత రేషన్ బియ్యాన్ని అందిస్తున్నట్లుగా ప్రజల్లో భ్రమలు కల్పించడం సరికాదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం పథకం ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది మంది పేదలకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు.కేంద్రం అందిస్తున్న సహాయాన్ని విస్మరించి కేవలం రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల ఫోటోలను మాత్రమే స్మార్ట్ రేషన్ కార్డులపై ముద్రించడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్న చర్య అని సతీష్ కుమార్ విమర్శించారు. స్మార్ట్ రేషన్ కార్డులపై దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి ఫోటోను కూడా విధిగా ముద్రించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా అందిస్తున్నట్లుగా ప్రజల్లో భ్రమలు కల్పించి రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ఆయన ఆరోపించారు. కేంద్రం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు తెలియజేయకుండా దాచిపెట్టే ప్రయత్నం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని అన్నారు. రేషన్ కార్డులు, సంక్షేమ పథకాల విషయంలో అనవసర రాజకీయాలు చేయడం మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సతీష్ కుమార్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని విస్మరించి రాజకీయ ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ముందు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని, సంక్షేమ పథకాల విషయంలో రాజకీయ ప్రచారానికి కాకుండా ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఎల్కంటి సురేష్, సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, సిద్దిపేట జిల్లా కోశాధికారి శ్రీరామ్ శ్రీకాంత్, తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్ అశోక్ యాదవ్, సిద్దిపేట్ జిల్లా కౌన్సిల్ మన్నే శేఖర్, గజ్వేల్, వర్గల్ మండల బిజెపి అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్, బొల్లిపల్లి తిరుపతి రెడ్డి, వివిధ మండలాల ప్రధాన కార్యదర్శిలు నాయిని సందీప్, ఇప్ప స్వామి, పిట్ల శేఖర్, కిరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620